# ఈనెల 8న యూపీఎస్సీ పరీక్ష

**- పగడ్బందీగా ఏర్పాట్లు పూర్తి - జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి కలెక్టరేట్, జూన్ 6 ప్రభాతవార్త : ఈ నెల 08న జరగనున్న యూపీఎస్సీ ఇంజనీరింగ్ సర్వీసెస్ (ప్రిలిమినరీ )పరీక్ష -2025 నిర్వహణకు పగడ్బందీగా ఏర్పాట్లు చేయడమైనదని జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు తెలిపారు. జిల్లాలో మొత్తం రెండు పరీక్షా కేంద్రాల్లో 791 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో డీఆర్వో నరసింహులు పరీక్షల నిర్వహణకు లైజన్ అధికారులు, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పేపర్ 1 ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, పేపర్ 2 మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు, సౌకర్యాలను కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యూపీఎస్సీ అబ్జర్వర్, న్యూఢిల్లీ ఎంఎస్ కిరణ్ కర్ణా అరోరా, డెప్యూటీ సెక్రటరీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**పరీక్షా కేంద్రముల వివరాలు:**

ఎస్.జి.ఎస్ ఆర్ట్స్ కాలేజ్, లక్ష్మీపురం సర్కిల్ దగ్గర, తిరుచానూరు రోడ్డు, తిరుపతి.
శ్రీ పద్మావతి బాలికల ఉన్నత పాఠశాల, టీటీడీ వెస్ట్ చర్చి రోడ్డు, బాలాజీ కాలనీ, తిరుపతి.

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

# తోతాపురి టన్ను రూ.12 వేలు

**- ప్రభుత్వ మద్దతు ధర అమలుకు పక్కా చర్యలు**
**- కలెక్టర్ సుమిత్‌కుమార్**

చిత్తూరు, జూన్ 6 ప్రభాతవార్త: తోతాపురి మామిడి టన్ను మద్దతు ధర 12 వేల రూపాయలుగా ప్రభుత్వం ప్రకటించిందని, రైతులకు ఈ ధర లభించేలా ప్రాసెసింగ్ కంపెనీలకు మామిడి సరఫరాపై పర్యవేక్షించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ తహసిల్దార్లు, వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో శుక్రవారం కలెక్టర్ సుమిత్ కుమార్ జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరితో కలిసి తోతాపురి మామిడిని ప్రాసెసింగ్ కంపెనీలకు తరలింపులో భాగంగా కంపెనీల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తోతాపురి రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి మద్దతు ధర ప్రకటించిందని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పూర్తి స్థాయిలో రైతులకు అంది మేలు జరిగేలా చేయడంలో జిల్లా యంత్రాంగం, రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, పోలీసు శాఖలు సమన్వయంతో ముందుకు వెళితే సత్‌ఫలితాలు వుంటాయన్నారు. ఈ క్రమంలో దీనిపై ఒక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి ఆ మేరకు పక్కాగా అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలకు ఇతర రాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుండి తోతాపురి మామిడి సరఫరా కాకుండా రాష్ట్ర సరిహద్దుల్లో వున్న చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలన్నారు. అలాగే మండల స్థాయిలో తహసిల్దారు, వ్యవసాయ అధికారి, ఉద్యాన అధికారి వారి పరిధిలోని ప్రాసెసింగ్ యూనిట్ల వద్ద రోజు మూడు షిఫ్ట్‌లలో విధులు నిర్వర్తించేలా విఆర్‌ఓ, ఉద్యాన, వ్యవసాయ అసిస్టెంట్లతో కలిసి ఒక బృందంగా మూడు బృందాలను సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే ఈ


మామిడి గిట్టుబాటు ధర పక్కాగా అమలు చేయడానికి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్

బృందాలతో పాటు రోజులో ఒకసారి మండల స్థాయి అధికారులు ప్రాసెసింగ్ కంపెనీల వద్దకు వెళ్ళి వాస్తవ పరిస్థితులను అంచనా వేయాలన్నారు. విధుల్లో వున్న వారు ప్రాసెసింగ్ కంపెనీలకు తోతాపురి మామిడిని అందించిన రైతుల వారీ వివరాలు, వారి ఆధార్ నెంబర్, బ్యాంకు ఖాతా, ఫోన్ నెంబర్ తదితరాలను పూర్తి స్థాయిలో నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ట్రేడర్లు, ఎఫ్‌టిఓ కలెక్షన్ సెంటర్లు, ర్యాంప్‌లు, మండీల వద్ద నుండి రైతులు వచ్చినప్పటికీ వారి వివరాలను నమోదు చేయాలన్నారు. అలాగే మామిడి ధర నిలకడగా వుంటుందని, పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే కోసి ప్రాసెసింగ్ కంపెనీలకు తరలించాలనే విషయంపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, ఈ విషయంలో క్షేత్ర స్థాయిలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అసిస్టెంట్లు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అలాగే దీనితో పాటు వారి పరిధిలో వన్న తోతాపురి రకం మామిడి పంట దిగుబి, ఏ రోజు ఎన్ని టన్నులు కోత కోయడం జరుగుతుందనే అంశంను పూర్తిగా అంచనా వేసిన పక్షంలో రైతులను ఏ ప్రాసెసింగ్ కంపెనీలకు పంపాలనే విషయంను అధికారులు నిర్ధారించుకోవడానికి అవకాశం వుంటుందన్నారు. ఈ దిశగా సైతం అధికారులు విధులు నిర్వర్తించాలని కలెక్టర్ వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. ఈ మామిడి సీజన్‌లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో మామిడి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, ఈ నెల రోజులు రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన శాఖలు సమన్వయంతో విధులు నిర్వర్తించడం ద్వారా రైతులకు మరింత మేలు చేసేందుకు అవకాశం వుంటుందన్నారు. అలాగే ర్యాంప్‌లు, కండీల్లో తూనీకలు, కొలతల శాఖ అధికారులు తూకాలను పర్యవేక్షిం చాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల ఉద్యానశాఖ అధికారులు మధుసూధన్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, రవిచంద్రబాబులు, డిఎస్‌ఓ శంకరన్, మార్కెటింగ్ ఏడి పరమేశ్వరన్, తూనికలు, కొలతలఉ శాఖ ఏడి స్వామి తదితరులు పాల్గొన్నారు.

**గృహ నిర్మాణ పథకంలో కాంట్రాక్టర్లు జాప్యం...**

# ఇబ్బంది పడుతున్న ప్రజలు : ఎమ్మెల్యే



గూడూరు, జూన్ 6 ప్రభాతవార్త: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పట్టణ గృహ నిర్మాణం పథకంలో కాంట్రాక్టర్లు సక్రమంగా ఇల్లు నిర్మించకుండా పేద ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హౌసింగ్ పథకంపై అధికారులు లబ్ధిదారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు లబ్ధిదారులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు అలాగే సీఎం సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో అనేక ఇల్లు మంజూరు చేయడం జరిగిందని ఆ తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొత్తగా ఇల్లు మంజూరు చేసి ఇల్లు నిర్మాణానికి లక్ష 80 వేల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని అయితే కొంతమంది కాంట్రాక్టర్లు డబ్బులు డ్రా చేసుకొని ఇల్లు సక్రమంగా నిర్మించలేదని వెల్లడించారు. ఇప్పుడు టిడిపి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ బీసీలకు అదనంగా 50వేల రూపాయలు ఇస్తున్నారని లబ్ధిదారులు దగ్గరుండి నివాసాల నిర్మాణాలను పరిశీలించుకోవాలని సూచించారు అలాగే అక్రమాలకు పాల్పడిన కాంట్రాక్టర్లు హౌసింగ్ ఉద్యోగులపై చర్యలకు సిఫారసు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కిరణ్ కుమార్, రహీం, చెంచురామయ్యలు పాల్గొన్నారు.

## అప్పలాయగుంట బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



వడమాలపేట, జూన్ 6 ప్రభాతవార్త: టీటీడీ అనుబంధ దేవాలయం అప్పలాయ గుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు వేద పండితులు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. శుక్రవారం వేకువ జామున శ్రీవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. తోమాలసేవ, కొలువు నిర్వహించారు. స్వామివారికి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి పట్టుపీతాంబ రాలతో అలంకరించారు. అనంతరం భక్తులు సర్వ దర్శనం చేసుకున్నారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, కంకణ బట్టార్ తిప్పయాచార్యులు పుట్ట మట్టితో మేదిని పూజ, సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవం ద్వారా శ్రీవిష్వక్సేనుల వారు నాలుగు మాడవీధుల్లో విహరించి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. తరువాత యాగశాలలో వేద పండితుల మంత్రోచ్ఛార ణలు, మంగళ వాయిద్యాల నడుమ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహించారు. రాత్రి శుద్ధి, ఏకాంతసేవ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరినాథ్, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

**బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి:**

అప్పలాయగుంట బ్రహ్మోత్సవాలు విస్తృత ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాలను తిలకించడానికి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం టీటీడీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని రంగువల్లులు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చలువ పందిళ్లు వేశారు. 9 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజు సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహిస్తారు. 10వ తేదీ స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుంది. ఈ బ్రహ్మోత్సవాలతో అప్పలాయగుంటలో పండుగ వాతావరణం నెలకొంది. ఇందులో భాగంగా శనివారం ఉదయం 6.55 నుంచి 7.30 గంటల మధ్య ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి.

# కోట్లు వెచ్చించి ముక్తిధామం... శవ పంచాయతీలతో సతమతం

*శ్రీకాళహస్తి మున్సిపాలిటి పరిధిలో ఎన్నో ఉద్యమాల తరువాత జీవనది పవిత్ర సువర్ణముఖి తీరాన సుమారు రూ.2కోట్లు వెచ్చించి ముక్తి ధామం పేరుతో శ్మశాన వాటికను నిర్మించారు. మున్సిపాలిటి నిధులతో నిర్మించిన ఈ ముక్తిధామం, పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుటకు శ్రీకాళహస్తీశ్వ రాలయం సహకరించింది. అయితే ఇక్కడకు వచ్చే శవాలకు సంబంధించి వెట్టిలు,గుంతలు తవ్వే వారు శవాలను తీసుకొచ్చే వారితో వివాద పడుతున్నారు. శవాలను దింపుడు కళ్ళం వద్ద గంటల తరబడి నిరీక్షింపజేస్తున్నారు. వారి సమస్యలను స్థానిక శాసనసభ్యునితో మొరబెట్టుకోవచ్చు, లేదా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకురావచ్చు. కానీ శవ కార్యక్రమాలను నిర్వహించే వారితో వివాద పడుతూ ఇబ్బందులు కల్గిస్తున్నారు. దీనిపై మునిసిపల్ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపి శవ నిరీక్షణకు గురౌతున్న వారి సమస్యలను పరిష్కారించాల్సి అవసరం ఎంతైనా వుంది.*

శ్రీకాళహస్తి,జూన్ 6 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణ ప్రజల కోసం రూ.కోట్లు వెచ్చించి స్వర్ణముఖి తీరాన అందంగా ముక్తిధామం ను నిర్మిం చారు. ఇది అత్యాధునిక సౌకర్యాలు కల్గిన శ్మశాన వాటిక. ఇక్కడ చక్కటి పార్కు ఏర్పాటు చేసారు.అలాగే శవాలను దహనం చేయటానికి యంత్రాలను ఏర్పాటు చేసారు. అయితే ఇక్కడకు శవాలు తీసుకొచ్చిన వారు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారింది. ఇదే పరిస్థితి బుధవారం కూడా చోటు చేసుకుంది. పట్టణంలోని సుమారు 80వేల మంది హిందువులకు సంబంధి ంచిన శ్మశాన వాటికను నిర్మించారు. చక్కటి భవనం. చుట్టు కూర్చొటానికి పార్కు నిర్మించారు. అయితే ఇక్కడ శవాల్ని ధహనం చేసే యంత్రం మరమ్మతులకు గురౌతుంది. దీని మరమ్మత్తుల గురించి అధికారులు పట్టించుకోరు. ఎవరైతే శవాన్ని తీసుకెళతారో వారే మరమ్మతులకు సొమ్ములు ఇచ్చుకోవాలి.


ముక్తిధామం దృశ్యం

**వివాదాలు:**

శ్రీకాళహస్తిలో ఎవరు చనిపోయిన మారిన కాలానుగుణంగా బంధువులు కార్యక్రమాలు చేసే పరిస్థితి లేదు. ఇందుకు పట్టంలో ఓ వ్యక్తికి దహన సంస్కారాలకు సంబంధించి చివరి మజిలి కార్యక్రమాలను కాంటాక్టుకు అప్పగిస్తున్నారు. ఆయనే చివరి మజిలికి సంబంధించిన వస్తువులతో పాటు పనులు చేయటానికి మనుషులను ఏర్పాటు చేసుకుంటారు. అలాగే వస్తువులు కొనుగోలు చేస్తారు. తప్పెట్లు, టపాసులు రథం అన్ని ఆయనే చూసుకుం టారు. శ్మశానం వద్ద దింపుడు కళ్లాం పనులు, ఆయనే చూసుకుంటారు.అయితే కొంత కాలంగా ఇక్కడ కొందరు ఆయనను అడ్డుకుంటు న్నారు. కారణం వారు గతంలో నదిలో గుంత తవ్వేవారని అయితే ప్రస్తుతం దహనం అది కూడా యంత్రాలతో నిర్వహిస్తు న్నారని తమ జీవనోపాధి కొల్పొయామని కాంటాక్టులో తమకు కూడా వాటా ఇవ్వమని కోరుతున్నారు. బుధవారం ఓ శవాన్ని తీసుకెళ్ళారు. అయితే ఇక్కడ కాంట్రాక్టర్, గుంతలు తవ్వేవారు వివాదపడ్డారు. సింగ్‌ను చివరి మజిలో దింపుడు కళ్ళాం వద్ద జరిపే కార్యక్రమాలకు రానివ్వలేదు. చివరకు ఆయన వదలిపెట్టి వెళ్ళారు.దాంతో శవాన్ని తీసుకెళ్ళిన వారు విధి లేక దింపుడు కళ్ళాం,పాలు పోయటం, బియ్యం సమర్పించే కార్యక్రమాలను జంగమ దేవర ద్వారా జరుపుకున్నారు. అయితే ఈ వివాదాలకు సంబంధించి మున్సిపల్ అధికారులు స్పందించాలి. అలాగే ఇక్కడ పరిస్థితిని సమస్యలను స్థానిక శాసనసభ్యుడు స్పందించి పరిష్కరించి సమస్యలకు పరిష్కార మార్గం చూపాల్సి వుంది.

# గ్రామాల సర్వతోముఖాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

తవణంపల్లె, జూన్ 6 ప్రభాతవార్త: గ్రామాల సర్వతోముఖాభివృద్దే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పూతలపట్టు, పలమనేరు ఎమ్మెల్యేలు డాక్టర్ కలికిరి మురళీ మోహన్, ఎన్ అమర్‌నాధరెడ్డిలు అన్నారు. గురువారం మండలంలోని వీరు పలు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఈమేరకు మండలంలోని సరకల్లు గ్రామంలో స్థానిక సర్పంచ్ కత్తి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులు నూతనంగా నిర్మించిన మహా కాళికా దేవి ఆలయం, విజయ గణపతి ఆలయంలలో కుంభాభిషేకం పూజల్లో పాల్గొని ప్రారంభోత్సవం చేశారు.అలాగే గ్రామంలో మహిళా సంఘం సమావేశ భవనము, సుమారు 13లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును కూడా ఎమ్మెల్యేలు మురళీమోహన్, అమర్ నాథరెడ్డిలు ప్రారంభించారు. అనంతరం అక్కడే వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రస్తుత ఖరీఫ్ రైతులకు సబ్సిడీపై వేరుశెనగ కాయలను రైతులకు పంపిణీ చేశారు.అలాగే మండలంలోని ముట్టుకూరు గ్రామంలో గ్రామస్థులు నూతనంగా నిర్మించిన శ్రీసీతారాముల స్వాముల వారి ఆలయ కుంభాభిషేకం ఉత్సవాల్లో పాల్గొని ఆలయాని న్ని ప్రారంభోత్సవం చేశారు.ఈసందర భంగా ఆలయంలో ఎమ్మెల్యేలు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం తవణంపల్లె పీహెచ్‌సీలో సుమారు 50 లక్షల రూపాయలతో నూతనంగా ఏర్పాటు చేసిన రక్త నమూనాల సేకరణ కేంద్రాన్ని ఎమ్మెల్యేలు ప్రారంభించారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్ళిన ఎమ్మెల్యేలు మురళీమోహన్, అమర్ నాథరెడ్డిలకు ఆయా గ్రామాల ప్రజలు, స్థానికి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, నియోజకవర్గంలో మండల పార్టీ అధ్యక్షులు దిలీప్‌నాయుడు, హరిబాబు నాయుడు, దొర బాబు చౌదరి, ధరణీధర్ నాయుడు, బంగారుపాళ్యం ఏఎంసీ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, కాణిపాకం ఆలయ మాజీఛైర్మన్ మణినాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి సునీల్ చౌదరి, టీడీపీ నాయకులు రఘురాం చౌదరి, ప్రవీణ్‌కుమార్ నాయుడు, కత్తి సుధార్‌రెడ్డి,చిట్టెమ్మ, శరవణకుమార్, ఎం.లత, ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, తహశీల్దార్ సుధాకర్, వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, మోహన్‌వేలు, కేశవనారాయణ, సర్పంచ్ కత్తి సతీష్‌రెడ్డిలతో పాటు పలువురు నాయకులు, మండల స్థాయి అధి కారులు పాల్గొన్నారు.


సరకల్లు గ్రామంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న

## ఫుట్ పాత్‌లపై షాపులను తొలగించండి : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జూన్ 6 ప్రభాతవార్త: నగరంలోని ఫుట్ పాత్‌లపై అడ్డదిడ్డంగా ఏర్పాటు చేసిన షాపులను, బండ్లను తొలగించి పాదచారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం నగరంలోని 36వ వార్డులోని గిరిపురం, రాజన్న పార్కు రామచంద్ర పుష్కరిణీ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని పలు ప్రాంతాల్లో పాదచారులకు ఇబ్బందికరంగా ఫుట్‌పాత్‌లపై దుకాణాలు, బండ్లు పెట్టి వ్యాపారాలు చేయడంతో పాదచారులకు ఇబ్బందికరంగా మారిందనే పిర్యాదులు ఎక్కువయ్యాయని అన్నారు. ప్లానింగ్ అధికారులు నగరంలోని ఫుట్ పాత్‌లపై ఉన్న షాపులను, బండ్లను తొలగించాలని అన్నారు. ఎవరైనా ఫుట్ పాత్‌లు ఆక్రమించి షాపులు పెడితే అపరాధ రుసుములు విధించాలని అధికారులను ఆదేశించారు. రాజన్న పార్కులో పాడైన ఆట వస్తువులను మరమ్మత్తులు చేయాలని, పెయింటింగ్స్ వేయించి శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట తుడా ఈ.ఈ రవీంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లు వెంకట ప్రసాద్, మధు,శిల్ప, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

## గరుడసేవకు ముందే పలకరించిన వరుణుడు

**-కన్నుల పండువగా గోవిందరాజస్వామి గరుడసేవ**



తిరుపతి,జూన్ 6ప్రభాతవార్త: తిరుపతి గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు శుక్రవారం రాత్రి అత్యంత కన్నులపండువగా గరుడ వాహనసేవ జరిగింది. గరుడసేవకు ముందు సాయంత్రం వరుణదేవుడు తిరుపతి వాసులను పలకరించాడు. అటు దేవుని ఉత్సవానికి ముందు ఆలయ మాఢవీధులను చల్లబరిచాడు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత గోవిందరాజ స్వామి ఉత్సవమూర్తిని అత్యంత విశేషంగా బంగారు ఆభరణాలు, పచ్చలపతకంతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. రాత్రి 7గంటలకు ప్రారంభమైన గరుడవాహనసేవపై కొలువైన స్వామి వారిని చూసి భక్తులు గోవింద నామాలతో భక్తిని చాటుకున్నారు. పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాల్లో గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. స్వామి వారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజేశారు. జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే భగవద ధిష్టుతుడైన గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియ జేశాడు. పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఎస్ఎసిఎఓ బాలాజీ, ఆలయ డిప్యూటీ ఈఓ విఆర్ శాంతి,ఏఈఓ మునికృష్ణారెడ్డి, ఆలయ అధికారులు,అర్చకులు పాల్గొన్నారు.

**-ఉదయం మోహినీ అవతారంలో**

శ్రీకాంతునిరూపం ధరించి జగత్సమ్మోహకంగా భక్తులకు దర్శభాగ్యమిచ్చాడు గోవిందరాజస్వామి. బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు శుక్రవారం ఉదయం శృంగార రసాధి దేవతగా మోహినీరూపంలో భక్తులకు మోక్షం కలిగించాడు. కమనీయమైన శ్రీకాంతుని రూపం జగత్సమ్మోహకంగా కనువిందు చేసింది. ఏనుగులు, అశ్వాలు ముందుకు కదులుతుండగా భక్తుల కోలాటాలు, డ్రమ్స్‌వాయిద్యాలు, ఇతర కళాప్రదర్శనల నడుమ ఊరేగింపు అత్యంత రమణీయంగా జరిగింది.

## నన్ను లిక్కర్ స్కామ్‌లో ఇరికించడం అనైతికం

**-లిక్కర్ వల్ల నా కుటుంబం సభ్యులు ఇద్దరిని కోల్పోయా! -మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి**



తిరుపతిరూరల్, జూన్6 ప్రభాతవార్త: లిక్కర్ స్కామ్‌లో కూటమి ప్రభుత్వం తనను ఇరికించి వేధించాలనే ప్రయత్నం చేస్తొందని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు. శుక్రవారం తుమ్మలగుంటలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లిక్కర్ వినియోగం వల్ల తమ కుటుంబంలో తండ్రిని, సోదరుడిని కోల్పోవడం జరిగిందని, లిక్కర్‌కు తాను ఎప్పుడు వ్యతిరేఖమేనని చెవిరెడ్డి స్పష్టం చేసారు. తన దగ్గర పనిచేసిన గిరి అనే గన్‌మ్యాన్‌ను వేధించారని, ప్రస్తుతం తనకు సన్నిహితంగా ఉండే వెంకటేష్ కుటుంబాన్ని తీసుకెళ్ళి వేధించటానికి చూస్తున్నారని వాపోయారు. నైతిక విలువలు ఉన్న వ్యక్తిపట్ల శ్రీనివాస్ విచక్షణ కోల్పోయి అనరాని మాటలతో మానసికంగా బాధపెట్టడం, తప్పుడు కేసులు పెట్టి వేధించడం సరికాదన్నారు. అమాయక ప్రజలను వేధించడం మానుకోవాలని, తనను నిర్భయంగా అరెస్ట్ చేసుకోవచ్చునని, అరెస్ట్‌కు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

## స్మార్ట్‌సిటీ తిరుపతిలో మత్తు ఇంజక్షన్ కలకలం

**-మార్కెట్ ప్రాంతంలో యువకుడు వేసుకుంటూ సంచలనం**



తిరుపతికార్పొరేషన్, జూన్ 6ప్రభాతవార్త: తిరుపతి నడిబొడ్డున ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్లో ఓ యువకుడు మత్తు ఇంజక్షన్ వేసకోవడం సంచలనం రేపుతోంది.ఆ ఇంజక్షన్ వేసుకునే యువకుడ్ని కూరగాయల మార్కెట్లో కొందరు వీడియో తీయడంతో వెలుగు చూసింది. శుక్రవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. ఇంజక్షన్ ద్వారా డ్రగ్ తీసుకుంటూ మత్తుకు బానిసైనట్లు చెబుతున్నారు. ఈ డ్రగ్స్ తీసుకుని వ్యక్తులు మత్తులో తూలుతూ, తుళ్ళుతూ మార్కెట్లో పడిపోతున్నారని వ్యాపారులు చెబుతున్నారు. మరీ యువత దీనికి బానిసలవడంతో విద్యాసంస్థలు పునఃప్రారంభం దగ్గరసమయంలో తిరుపతిలో ఏం జరుగుతుందనేది తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

## చెడ్డపేరు తీసుకురాకండి

**-తప్పుచేస్తే ఉపేక్షించేదిలేదు -ఏఆర్ పోలీసులకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు హెచ్చరిక**



తిరుపతి,జూన్ 6ప్రభాతవార్త: చెడ్డపేరు తీసుకు వచ్చేలా పోలీసు విధులు నిర్వహించకండని, తెలిసీతెలియక తప్పుచేస్తే ఉపేక్షించేది లేదని తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు.పోలీస్‌శాఖ క్రమశిక్షణతో కూడిందని, ఇక్కడ ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలన్నారు. అక్రమమార్గంలో తప్పుడు పనులు చేసినా, చేయాలనుకున్నా పోలీసు ఉద్యోగం వదలిపెట్టాలని తీవ్రంగా హెచ్చరికలు చేశారు. ఇటీవల ఏఆర్ కానిస్టేబుల్ గుణశేఖర్ గంజాయి సరఫరా చేస్తూ హైదరాబాద్ పోలీసులకు పట్టుబడిన విషయం విదితమే. అతనికి సహకరించిన ఆర్మ్‌డ్ హెడ్‌కానిస్టేబుల్ రామచంద్రను కూడా పోలీస్ శాఖ నుండి తప్పించారు. దీంతో వీరిపై పర్యవేక్షణ చేయాల్సిన ఏఆర్ డిఎస్పీ రవీంద్రారెడ్డిపై బదిలీ వేటు పడింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఏఆర్ పోలీసులకు ఫెరేడ్ గ్రౌండ్‌లో సమావేశం నిర్వహించారు. పోలీసుశాఖ సమాజంలో ఒక గుర్తింపు ఉన్నదని, ఇక్కడ పనిచేసే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, బాధ్యత కలిగిఉండాలన్నారు. ఏఆర్ పోలీసులు మరింత బాధ్యతతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏదైనా పొరబాటుచేసే ముందు మీ వెను క ఒక కుటుంబం ఉందని వాళ్ళ అందరి జీవితాలు మీద ఆ ప్రభావం పడుతుందని గుర్తుపెట్టుకోవాలన్నారు. పోలీసులలో ఏ ఒక్కరూ తప్పుచేసినా దానిప్రభావం పోలీసుశాఖపై చూపుతుందని ఆవేదన చెందారు. మీరు పోలీసు వ్యవస్థకు చెడ్డపేరు తీసుకురావద్దని, ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. మీ పై అధికారి దృష్టికి తీసుకెళ్ళితే వారు నాకు తెలియజేస్తే ఆ సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. తప్పుచేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, ఏకంగా పోలీసుశాఖ నుండే తప్పించడం జరుగుతుందన్నారు. పోలీసు ఉద్యోగంలో ఉండి తప్పుచేస్తే ఎంతటివారైనా వదలిపెట్టే ప్రసక్తేలేదని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు హెచ్చరించారు. అనంతరం ఏఆర్ పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు.

## ఎక్కడ లేని విధంగా కైలాసధామం ఏర్పాటు

– ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, జంగాలపల్లి శ్రీనివాసులు



చిత్తూరు, జూన్ 6 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లాలో ఎక్కడ లేని విధంగా చిత్తూరులో ఆర్యవైశ్యులు కైలాసధామం ఏర్పాటు చేసుకున్నారని దీని నిర్మాణానికి దాతలం దరు సహకారం అందించారని ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్ నాయుడు, జంగాలపల్లి శ్రీనివాసులులు పేర్కొన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 40వ డివిజన్‌లో ఆర్యవైశ్యుల కైలాసధామంను శుక్రవారం అమరరాజ ఫ్యాక్టరీల ఫౌండర్ గల్లా రామచంద్రనాయుడు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, జంగాలపల్లి శ్రీనివాసులులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు గురజాల, జంగాలపల్లి మాట్లాడుతూ చిత్తూరులో ఎక్కడ లేని విధంగా కైలాసధామంను ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, ప్రముఖులు సౌమ్య, మాజీ ఎమ్మెల్యేలు ఎఎస్ మనోహర్, ఆర్.గాంధీలు, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, నాయకులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల నీటి సమస్య పరిష్కారానికి నీటి బోరు డ్రిల్లింగ్



పాలసముద్రం, జూన్ 6 ప్రభాతవార్త: మండలంలోని కృష్ణజిమ్మాపురం పెరుమాలపల్లి గ్రామ ప్రజల మంచినీటి సమస్యను పరిష్కరించడానికి శుక్రవారం మండల పరిషత్ నిధులతో సర్పంచ్ భానుప్రియ తంగరాజు కొత్త బోరును డ్రిల్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భానుప్రియ మాట్లాడుతూ పంచాయతీ సమస్యలను సత్వరం పరిష్కరించడానికి ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ దృష్టికి తీసుకెళితే వెంటనే ఆయన స్పందించి ఎంపిపితో మాట్లాడి బోరు మంజూరు చేశారన్నారు. స్థానిక ప్రజలు తమ గ్రామ మంచినీటి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్, స్థానిక సర్పంచ్ భానుప్రియ తంగవేలుకు కృతజ్ఞతలు తెలిపారు.

## 6 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



యాదమరి, జూన్ 6 ప్రభాతవార్త: యాదమరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఆరు టన్నుల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకుని స్మగ్లర్ల నుండి 78 వేల రూపాయల నగదు, మూడు వాహనాలను సీజ్ చేశారు. ఎస్ఐ ఈశ్వరయ్య వెల్లడించిన వివరాల మేరకు రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నదని వచ్చిన మందస్తు సమాచారంతో తహసిల్దారు పార్థసారధి, పోలీసు సిబ్బందితో తాను చిత్తూరు–బెంగళూరు జాతీయ రహదారి వరిగిపల్లి వద్ద కాపు కాసి వాహనాలను తనిఖీ చేయడం ప్రారంభించామన్నారు. ఈ క్రమంలో ఒక బొలోరో, టాటాఏస్, ఒక ద్విచక్రవాహనం తనిఖీ చేయడంతో అందులో నుండి 6 టన్నుల రేషన్ బియ్యం పట్టుబడిందన్నారు. ఈ కేసులో పమలనేరుకు చెందిన సద్దాం హుస్సేన్ అనుచరులు బైరెడ్డిపల్లికి చెందిన కిషోర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, బలరాంరెడ్డి, బంగారుపాళ్యంకు చెందిన మోతీలను పోలీసులు అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఈశ్వరయ్య వెల్లడించారు.

## పాల ట్యాంకర్‌పై నుండి పడి వ్యక్తి మృతి!

యాదమరి, జూన్ 6 ప్రభాతవార్త: పాల ట్యాంకర్‌పై నుండి ఓ వ్యక్తి పడి మృతి చెందిన సంఘటన శుక్రవారం యాదమరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. యాదమరి పంచాయతీ పరిధిలోని ఓ ప్రైవేటు డైరీలో రాజశేఖర్‌రెడ్డి(58) పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం పాల ట్యాంకర్ రావడంతో ట్యాంకర్ పైకి ఎక్కి రాజశేఖర్‌రెడ్డి ట్యాంకర్‌కు సీలు వేస్తుండగా కాలు జారి కింద పడిపోయాడు. ఇలా కింద పడిపోయిన రాజశేఖర్ తలకు తీవ్ర గాయం కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహంను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహంను పంపించారు.

## పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



చిత్తూరు, జూన్ 6 ప్రభాతవార్త: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు శుక్రవారం మూడు జతల యూనిఫాంలను పంపిణీ చేశారు. కట్టమంచి మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఈ యూనిఫాం దుస్తులను ఎమ్మెల్యే పారిశుధ్య కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర పరిధిలో పారిశుధ్య నిర్వహణలో పారిశుధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తారని, ప్రభుత్వం వీరికి అందించాల్సిన సౌకర్యాలను సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, దేశం నాయకులు చంద్రప్రకాష్, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పూతలపట్టు, జూన్ 6 ప్రభాతవార్త : మండల పరిధిలో ఏం బండపల్లి కళ్యాణ మండపం సమీపన గురువారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన రామలింగ (60) రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా పూతలపట్టు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న పాల వ్యాను ఢీ కొట్టినట్లు తెలిపారు. ఈ సంఘటన మండలంలో చోటుచేసుకుంది. రామలింగం అక్కడక్కడ మృతి చెందాడు కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జేఈఈ టాపర్‌కు ముఖ్యమంత్రి అభినందన



తిరుపతి విద్య, జూన్ 6 ప్రభాత వార్త : జేఈఈ అడ్వాన్స్ 2025 ఫలితాలలో జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరీలో 51వ ర్యాంకు సాధించిన స్థానిక నారాయణ విద్యాసంస్థల విద్యార్థి మాండవ్యపురం భానుచరణ్ రెడ్డిని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు.నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ పొంగూరు సింధు నారాయణ,శరణి నారాయణల ఆధ్వర్యంలో జే ఈ ఈ అడ్వాన్స్ పరీక్షలో రాష్ట్రం నుంచి జాతీయ స్థాయిలో 100 లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులు ముఖ్యమంత్రిని వారి క్యాంపు కార్యాలయంలో కలిసిన సందర్భంగా, ఉత్తమ ర్యాంకులు సాధించినందుకు విద్యార్దులను అభినందించి, ఉన్నత విద్యాభ్యాసం తరువాత వారి సేవలు రాష్ట్రానికి అందించాలని సూచించారు. రాబోయే 10 సంవత్సరాలలో రాష్ట్రం క్వాంటమ్ కంప్యూటింగ్ కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని,ప్రతిభ కల యువత రాష్ట్ర అభివృద్ధిలో భాగంకావాలని ఆకాంక్షించారు.

## కన్నులవిందుగా పుష్పపల్లకి

యాదమరి, జూన్ 6 ప్రభాతవార్త: యాదమరి త్రివేణి సంగమంలో వెలసిన శ్రీ భూదేవి,శ్రీదేవి సమేత శ్రీ వరదరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి పుష్పపల్లకి సేవ కన్నులవిందుగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఆలయంలో వేద పండితులు మూలవర్లకు పుష్ప కైంకర్యాలు నిర్వహించి స్వామివారిని అభిషేకించి అనంతరం భక్తులకు స్వామి వారిని దర్శన భాగ్యం కల్పించారు. పుష్పపల్లకి రాత్రి 12 గంటలకు ప్రారంభమై ఉదయం 4 గంటల వరకు యాదమరి మాడవీధుల్లో తిరుగుతూ భక్తులకు స్వామి వారు దర్శనమిచ్చారు. పుష్పపల్లకిలో అలంకరితుడైన స్వామి వారిని యాదమరి, యాదమరి పరిసర ప్రాంతాల్లోని భక్తులతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి అత్యధిక భక్తులు హాజరై దర్శించుకున్నారు.

## ఎన్ఎంఎంఎస్‌కు ముగ్గురు విద్యార్థులు ఎంపిక



యాదమరి, జూన్ 6 ప్రభాతవార్త: యాదమరి మండలం నుండి నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్‌షిప్‌కు ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ స్కాలర్‌షిప్‌కు డికె చెరువు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి త్రిష, కె.గొల్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రదీప్, వరిగిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి వేదవ్యాస్‌లు ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారులు రుక్మిణి, ప్రసాద్‌లు పేర్కొన్నారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన ఒకొక్క విద్యార్థికి నాలుగు సంవత్సరాల పాటు ప్రతి ఏడాది 12 వేల రూపాయలు స్కాలర్‌షిప్ మంజూరు అవుతుందన్నారు. నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను ఎంఇఓలు రుక్మిణి, ప్రసాద్‌లతో పాటు పాఠశాల హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

## టన్నుకు రూ.12 వేలు చెల్లించకుంటే చర్యలు : ఎమ్మెల్యే



చిత్తూరు, జూన్ 6 ప్రభాతవార్త: ప్రభుత్వం నిర్ణయించిన మేరకు తోతాపురి మామిడి టన్నుకు 12వేల రూపాయలు రైతులకు చెల్లించకుండా ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. చిత్తూరు మార్కెటింగ్ యార్డును శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించి మామిడి వ్యాపారులతో మాట్లాడారు. ప్రభుత్వం తోతాపురికి గిట్టుబాటు ధర ప్రకటించిందని, ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు ఒక టన్ను మామిడికి రైతుకు రూ.8 వేల చెల్లిస్తే ప్రభుత్వం మరో రూ.4 వేల చెల్లించి ఒక టన్ను తోతాపురి మామిడిపై రైతుకు రూ.12 వేలు చెల్లించనుందన్నారు. ప్రతి ఫ్యాక్టరీ రైతుల నుండి రూ.12 వేలకు తోతాపురి మామిడి కొనుగోలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ మామిడి రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించిందన్నారు. జిల్లాలోని అన్ని ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలను పరిశీలించి వాటి యాజమానులతో చర్చించి మామిడి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని కలెక్టర్ నిర్ణయించారన్నారు. ఈ సమావేశంలో మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, తెలుగుదేశం నాయకులు చంద్రప్రకాష్, వెంకిటీల సురేంద్రకుమార్, కాజూరు బాలాజీ, కోదండయాదవ్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ పార్టీ ఇన్‌ఛార్జీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతన్నలను ఆదుకొనేది కూటమి ప్రభుత్వమే : తేదేపా



చౌడేపల్లి, జూన్ 6 ప్రభాతవార్త : రైతన్నలను ఆదుకొనేది కూటమి ప్రభుత్వమేనని తేదేపా నాయకులన్నారు. స్థానిక పరిపాలనా భవనం వద్ద రైతులకు విత్తన శనక్కాలయలను అందించారు. కూటమి ప్రభుత్వ రథసారధి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కర్షకులకు పెద్దపీట వేస్తున్నారన్నారు. రైతులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. తేదేపా నాయకులు ఆవుల రామచంద్రయ్య, పూల చంద్రమౌళి, కార్తీక్, హరి, మునివెంకటప్ప, సోము, చిన్ని, రమేష్, ఎంపిడిఓ లీలామాధవి, వ్యవసాయాధికారిణి జ్యోతమ్మ, తేదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి కలెక్టర్ ఆర్థిక సాయం



చౌడేపల్లి, జూన్ 6 ప్రభాతవార్త: తేదేపా ఆధ్వర్యంలో కడపలో జరిగిన మహానాడుకు వెళ్ళి వస్తూ మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి కలెక్టర్ నిధి నుంచి ఆర్థిక సాయమందించినట్లు తహశీల్దార్ హనుమంతు తెలిపారు. మండలంలోని పంచాయతీ కేంద్రం ఆమినిగుంటకు చెందిన మురళి ఇటీవల కడపలో జరిగిన మహానాడు వెళ్ళి తిరిగి వస్తూ మార్గమధ్యలో గుండె పోటుతో మృతి చెందాడు. తేదేపా నాయకుడు వేలూరు సుబ్రమణ్యం చొరవతో స్పందించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బాధిత కుటుంబ సభ్యులకు రూ. 50వేలు అందించినట్లు తహశీల్దార్ వివరించారు.

## బక్రీదులను సుఖశాంతులతో జరుపుకుందాం



చౌడేపల్లి, జూన్ 6 ప్రభాతవార్త: మతసామరస్యానికి, త్యాగానికి ప్రతీకగా నిలచిన బక్రీదు పండుగను సుఖశాంతులతో జరుపుకుందామని ఎస్ఐ నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు. ఈమేరకు మండలంలోని హిందూ, ముస్లిం పెద్దలతో స్థానిక పోలీస్టేషన్ నందు సమావేశం నిర్వహించారు. ఈనెల 7న జరిగే బక్రీదు పర్వదినం సందర్భంగా మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా బందోబస్తు చర్యలు చేపట్టామన్నారు.

## వైష్ణవీమాతకు ఏకాదశి పూజలు



**చౌడేపల్లి, జూన్ 6 ప్రభాతవార్త :** మండలంలోని పుదిపట్లలో గల వైష్ణవీమాతకు ఏకాదశి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకురాలు శ్రావణి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కలు చెల్లించారు. ఆలయ నిర్మాణదాత వినోద్‌కుమార్‌రెడ్డి భక్తులకు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## అంగన్వాడీలను తనిఖీ చేసిన ఐసిడిఎస్ పిడి



**కల్లూరు, జూన్ 6 ప్రభాతవార్త:** పులిచెర్ల, పరిధిలోని కల్లూరు 3, అంగన్వాడి, కేంద్రంను చిత్తూరు ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరి విజిట్ చేశారు. పుట్టినప్పటి నుంచి, ఐదు సంవత్సరాల వారికి, బరువులు, ఎత్తులు, చూసి పిల్లల తల్లులకు పిల్లల యొక్క బరువులు, ఎత్తులుపై అవగాహన పరిచి, మంచి పౌష్టికాహారం, పిల్లలకు పెట్టి ఎత్తు బరువులు తగ్గట్లు ఉండాలని అప్పుడే చిన్న పిల్లల ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంగన్వాడి నందు ఎవరు కూడా లోప పోషణకు గురికాకుండా ఉండాలని తెలిపారు. ఇన్చార్జి సిడిపిఓ మల్లీశ్వరి, సూపర్వైజర్ విజయలక్ష్మి, కార్యకర్తలు సింధు శ్రీ, శ్యామల, పిల్లలు తల్లులు పాల్గొన్నారు.

## చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## శ్రీలక్ష్మీనరసింహుని సేవలో చల్లా బాబు



పుంగనూరు రూరల్, జూన్ 6 ప్రభాతవార్త : మండలంలోని గూడూరు పల్లి గ్రామ సమీపంలో శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయ ప్రారంభోత్సవ శుక్రవారం ఉదయం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు హోమాలు అభిషేకాలు చేశారు. స్వామివారి టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి చల్లా బాబు స్వామివారిని దర్శించుకున్నారు. దశాబ్దాల క్రితం బిజెపి నేత మునివేలు కృషితో ఏర్పడిన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయం పునర్నిర్మాణమై పట్టణానికే ఖ్యాతి తెచ్చే విధంగా రూపుదిద్దుకుంది. ఆలయ పునఃప్రతిష్ట ప్రారంభోత్సవ కార్యక్రమాల అత్యంత వైభవంగా జరిగాయి తెలుగుదేశం పార్టీ నాయకులు సివిరెడ్డి మాధవరెడ్డి పోలీస్ గిరితో పాటు ఆలయ కమిటీ నాయకులు, ప్రజలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు గ్రంథాలయాలపై మక్కువ చూపాలి:కమీషనర్



కుప్పం, జూన్ 6 ప్రభాతవార్త: విద్యార్థులు గ్రంథాలయాల పట్ల మక్కువ చూపాలని కుప్పం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో 35రోజులుగా నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంకు ఆయన హాజరై ప్రసంగించారు. ఏటా గ్రంథాలయ శాఖ పిల్లలకు వేసవిలో ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించడం మంచి కార్యక్రమం అన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వరబాబు, లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్, గ్రంథాలయ అధికారిణి సత్యవాణి, స్థానికులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమం సిఎం చంద్రబాబు ధ్యేయం



కుప్పంరూరల్, జూన్ 6 ప్రభాతవార్త : రైతుల సంక్షేమమే సిఎం చంద్రబాబు నాయుడు ధ్యేయమని తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చెక్కునత్తం మణి, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం చెక్కునత్తం రైతు సేవా కేంద్రంలో రైతులకు రాయితీ వేరుసెనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా ప్రభుత్వం ఇస్తున్న రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకుని పంటసాగు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నేతలు మహేంద్ర, రాజా, రమేష్, తిమ్మప్ప, బీరప్ప, మునిరత్నం, రామప్ప, బాలు, వెంకటాచలం, మాదేష్, చంద్రబాబు, విఎఎ జయసుధ, రైతులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేస్తున్న సిఎం చంద్రబాబు : గౌనివారి

శాంతిపురం, జూన్ 6 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను సిఎం చంద్రబాబునాయుడు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. 16347పోస్టులతో డిఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించడంతో పాటు దీపం –2 పథకంలో మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తోందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసినట్లు తెలిపారు. 1200కోట్లతో రోడ్ల మరమ్మతులు, 990కోట్లు పంచాయతీల్లో అభివృద్ధి పనులకు కేటాయించారన్నారు. 4500కోట్లతో గ్రామాల్లో 30వేల పనులకు శ్రీకారం చుట్టారన్నారు. 9.20లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని తద్వారా 5.70లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయన్నారు. శ్రీసిటీలో 5వేల కోట్లతో ఎల్‌జి పరిశ్రమ వచ్చిందన్నారు. అమరావతికి 15వేల కోట్ల ఆర్థికసాయం, పోలవరం ప్రాజెక్ట్‌కు 12500కోట్లు విడుదల చేశారన్నారు. విశాఖకు రైల్వే జోన్ మంజూరుచేశారన్నారు. ఈనెలలోనే తల్లికి వందనం, రైతులకు అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేయడం జరుగుతోందన్నారు.ఆగస్టు15నుంచిమహిళలకుఉచితబస్సు ప్రయాణం ప్రారంభి స్తారన్నారు.

## 10న కుప్పం మండల మీట్

కుప్పం, జూన్ 6 ప్రభాతవార్త : మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 10వతేది కుప్పం మండల కార్యాలయంలో ఉదయం జరుగుతుందని ఎంపిడిఓ విజయదత్ తెలిపారు. సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

## కుప్పంలో రోడ్డు విస్తరణకు సహకరించాలి

– మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్



కుప్పం, జూన్ 6 ప్రభాతవార్త : కుప్పం పట్టణంలో మూడో రీచ్ రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు, దుకాణదారులు సహకరించాలని మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ కోరారు. శుక్రవారం స్థానిక సుజ్ఞానంద ఆశ్రమంలో మూడో రీచ్ పరిధిలో ఉన్న దుకాణదారులు, ఇళ్ల యజమానులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే రెండు రీచ్‌ల పరిధిలో పనులు పూర్తయిన నేపథ్యంలో మూడో రీచ్‌లో సైతం రోడ్డు విస్తరణకు భవన యజమానులు, వ్యాపారులు సహకరించాలన్నారు. ఈ రీచ్ పనులు టౌన్‌బ్యాంక్ సర్కిల్‌నుంచి రైల్వేగేటు క్రాస్ వరకు జరుగుతాయన్నారు. ప్రభుత్వం కూడా తగు పరిహారం భవన యజమానులకు చెల్లిస్తుందన్నారు. కుప్పం మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా మార్చాలని సిఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారన్నారు. పట్టణ సుందరీకరణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థను సైతం అందుబాటులో తేనున్నారన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, నేతలు ఎల్ఎల్ ఉదయ్‌కుమార్, ఆర్ఆర్ రవి, అజిత్ ఆనంద్, శ్యాంసుందర్, మంజు, అమర తదితరులు పాల్గొన్నారు.

## రేపు కాణిపాకంలో సామూహిక అక్షరాభ్యాసం

కాణిపాకం, జూన్ 6 ప్రభాతవార్త సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం స్వయంభు కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో ఈనెల 8న సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. పాఠశాలల్లో విద్యాభ్యాసం ప్రారంభించు చిన్నపిల్లలకు సకల విద్యలకు అధిపతి అయిన శ్రీవినాయకస్వామివారి అనుగ్రహం కలిగి విదా ్యభ్యాసంలో సమస్త విఘ్నాలు తొలగించుటకు దేవస్థానం వారిచే ఈనెల 8న సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక ఆస్థాన మండపంలో 8న ఉదయం 7 గంటల నుండి 12 గంటల వరకు శుద్ద త్రయోదశి, స్వాతి నక్షత్రం నందు సామూహిక అక్షరాభ్యాసం పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.అక్షరాభ్యాసంలో పాల్గొనే చంటి పిల్లలకు పలక, బలపము, పూజా సామాగ్రి ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

## నేడు బక్రీద్ పర్వదినం

కుప్పం, జూన్ 6 ప్రభాతవార్త : ముస్లిం సోదరుల పవిత్రమైన బక్రీద్ పర్వదినాన్ని శనివారం జరుపుకోవాలని మత గురువులు సూచించారు. బక్రీద్ పండగ సందర్భంగా కుప్పం పట్టణంలో ఉదయం 7.30గంటలనుంచే ఈద్గాల వద్ద ఈద్ ప్రార్థనలు చేపట్టడం జరుగుతుందన్నారు. ముస్లింసోదరులు పండగను సుఖసంతోషాలతో బంధుమిత్రులతో కలసి స్నేహభావంతో జరుపుకోవాలని సూచించారు.

## ఆర్ ఐఓగా రాజశేఖర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



తిరుపతి విద్య, జూన్ 6 ప్రభాత వార్త: ఆంధ్రప్రదేశ్ బోర్డు అఫ్ ఇంటర్మీడియట్ ఎద్యుకేషన్ తిరుపతి జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణ అధికారిగా జి.రాజశేఖర్ రెడ్డి ని నియమించింది. ఈ మేరకు ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన చంద్రగిరి బాలికల కళాశాల ప్రిన్సిపాల్ గా వ నిచేస్తున్నారు. అలాగే తిరుపతి జిల్లా ఇంటర్మీడియట్ ఎద్యుకేషన్ అధికారిగా పూర్తి బాధ్యతలు తీసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాల ఇంటర్ బోర్డు నియమాలు,విధి విధానాలు తప్పనిసరిగా పాటించాలి అని కోరారు. అడ్మిషన్స్,కళాశాల లో సౌకర్యలు ఇంటర్ బోర్డు నియమావళి ప్రకారం పాటించాలి అని సూచించారు.ఇంటర్ బోర్డు నియమావళి అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్స్ పెంచేందుకు ప్రిన్సిపాల్స్,కళాశాల అధ్యాపకులు కృషి చేయాలి అని సూచించారు.అన్ని యాజమాన్య కళాశాలలలో ప్రభుత్వ ఉత్తరువుల మేరకు యోగా తరగతులు జరపాలి,యోగాంధ్ర ప్రోగ్రామ్ ను జయప్రదం చేయాలి అని సూచించారు.

## 25 నుంచి డిగ్రీ ఇన్స్టెంట్ పరీక్షలు

తిరుపతి విద్య, జూన్ 6 ప్రభాతవార్త : ఎస్వీయూ పరిధిలో 2022–23 బ్యాచ్ డిగ్రీ 5వ సెమిస్టర్ రెగ్యులర్గా చదవి పరీక్షలలో తప్పిన విద్యార్థులకు ఈనెల 25వతేదీ నుంచి ఇన్స్టెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ రాజమాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈనెల 16వ తేదీలోపు పరీక్ష ఫీజును చెల్లించాలని తెలియజేశారు.రూ.1500 అపరాధ రుసుముతో 18 వరకు, రూ.3500ల అపరాధ రుసుముతో ఈనెల 20వ తేదీలోపు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.మరిన్ని వివరాల కోసం వర్సిటీ వెబ్సైట్ ను సంప్రదించాలని సూచించారు.

## ప్రశాంతంగా అలిపిరిలో దివ్యదర్శనం టోకెన్లు జారీ



తిరుమల,జూన్ 6ప్రభాతవార్తప్రతినిధి: కాలినడకన తిరుమలకు శ్రీవారిమెట్టు మార్గంలో వచ్చే భక్తులకు సౌలభ్యంగా దివ్యదర్శనం టోకెన్లు జారీ అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లో ప్రారంభమైంది. రోజువారీగా శ్రీవారిమెట్టుమార్గంలో ఇబ్బందులు పడుతుండటంతో భక్తులకు సాఫీగా, ప్రశాంతంగా టోకెన్లు భూదేవి కాంప్లెక్స్‌లో అందుకుంటే ఉచిత బస్సురవాణా కల్పిస్తున్నారు. ఈ టోకెన్లు జారీతొలిరోజు శుక్రవారం సాయంత్రం టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ పర్యవేక్షించారు. నేడు ఆలయంలో స్వామివారి దర్శనం చేసుకోనున్నారు.

## లాసెట్ కీ విడుదల

తిరుపతి విద్య, జూన్ 6 ప్రభాతవార్త : పద్మావతి మహిళా వర్సిటీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన 3, 5 ఏళ్ల లా కోర్సులలోనూ, పీజీ లా కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించిన లాసెట్2025 పరీక్షకు సంబంధించి ప్రాథమిక కీని శుక్రవారం విడుదల చేశారు. అభ్యర్థులు ప్రాథమిక కీ కోసం ఉన్నత విద్యామండి వెబ్సైట్ను సంప్రదించాలని అధికారులు సూచించారు. జవాబు కీ పై 8వ తేదీ లోపు అభ్యంతరాలను తెలిపేందుకు అవకాశం ఇచ్చారు. అభ్యంతరాల సమీక్ష అనంతరం 16న ఫైనల్ కీ విడుదల చేసి 22వ తేదీన ఫలితాలను ప్రకటించనున్నారు.

## మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం



పుత్తూరు రూరల్, జూన్ 6 ప్రభాతవార్త: మండల విద్యాశాఖ పరిధిలో ఉన్న పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం ఎగువ కనకంపాళెం పాఠశాలలో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ టాటా ట్రస్టు ప్రోగ్రాం అసోసియేట్ వారు బి.సంతోషి వారి ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి తిరుమలరాజు హాజరై ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం చాలా ముఖ్యమైందని, పాఠశాలలకు మధ్యాహ్నం భోజనం కొరకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పోర్టిఫైడ్‌బియ్యం అందిస్తున్నదని, మంచి పోషకాలు కలిగిన ఆహారం అందించాలని విద్యార్థులకు ఆరోగ్యపరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హరినాథ్, ఎంటీఎస్ ఉపాధ్యాయులు మణికంఠన్, చిన్న కేశవులు, పాఠశాల ఛైర్‌పర్సన్, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

# సిమ్స్ హాస్పిటల్‌లో క్యాన్సర్‌కు వైద్యం

బాలాయపల్లి, జూన్ 6 ప్రభాతవార్త: సిమ్స్ ఆస్పత్రిలో క్యాన్సర్ వ్యాధికి అత్యాధునిక వైద్యం అందిస్తున్నట్లు వైద్యాధి కారిణి డాక్టర్ చైతన్య భాను తెలిపారు. బాలాయపల్లి మండలం వెంగమాంబపురం, కయ్యూరు గ్రామ సచివాలయ ఆవరణలో పింక్ బస్సు స్క్రీనింగ్ పరీక్షలు శ్రీ బాలాజీ ఇన్స్టిట్యూట్ అఫ్ ఆంకాలజి, స్విమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగాయి. మొబైల్ కాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ ద్వారా ఉచితంగా కాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరాన్ని స్విమ్స్ వైద్యాధికారిణి డాక్టర్ చైతన్య భాను నిర్వహించారు. రోగులకు బిపి, షుగర్, ఇంకా పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. చుట్టు ప్రక్కల గ్రామాలనుంచి వచ్చి మహిళలు, వృద్ధులు వైద్య పరీక్షలు బస్సు వద్దకు చేరుకొని పరీక్షలు చేయించుకున్నారు. స్విమ్స్ వైద్యాధికారిణి చైతన్య భాను మాట్లాడుతూ ఇప్పటివరకు పలు గ్రామాలలో450 క్యాంపులు ఈ పింకు బస్సు ద్వారా నిర్వహించినట్లు తెలిపారు. 35 వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించా మన్నారు. 45 సంవత్సరాలు నిండిన మహిళలందరూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలన్నారు. మే నెల 22 నుంచి జరుగుతున్న ఈ స్క్రీనింగ్ పరీక్షలు ఈ నెల 9తో ముగుస్తాయన్నారు. ఈ కాన్సర్ స్క్రీనింగ్ లో స్విమ్స్




వైద్యాధికారిణి డా.చైతన్య భాను, వైద్య సిబ్బంది ఏ.ఎన్.ఎం. రత్నమ్మ, ఆశా వర్కర్లు, స్విమ్స్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

గూడూరు, జూన్ 6 ప్రభాతవార్త: వినియోగదారులకు వేగవంతంగా సేవలు అందించడం సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు టెలికం రెగ్యులటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రై కన్స్యూమర్ ఔట్ రిచ్ ప్రోగ్రాం లో నిర్వహిస్తుందని అడ్వైజర్, ఆర్వో హైదరాబాద్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో టెలికం రెగ్యులటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రై కన్స్యూమర్ ఔట్ రిచ్ ప్రోగ్రాం నిర్వహించారు. టిఆర్ఎఐ అడ్వైజర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గత పది సంవత్సరాల్లో టెలికం రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని సెల్ ఫోన్లు, ఇంటర్నెట్ వాడకం విపరీతంగా పెరిగిందని తెలిపారు. అలాగే ఇప్పుడు సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని వీటన్నిటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టిఆర్ఎఐ ప్రజలకు వేగవంతంగా నాణ్యమైన సేవలు అందించేందుకు ఎప్పటికప్పుడు అనేక మార్పులు తీసుకొస్తున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో సురేష్ బాబు, బిక్షం, హేమంత్, రవి ప్రసాద్, నీరజ, విద్యార్థినీ విద్యార్థులు టెలికం అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్ణయం... విద్యార్థులకు వరం

కోట, జూన్ 6 ప్రభాతవార్త రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కాకూడదని కూటమి ప్రభుత్వం కొత్త ఆలోచనకు శ్రీకారంచుట్టింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు ఈఎపి సెట్, నీట్‌లో శిక్షన ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఈ విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులను సన్నద్ధం చేయాలని మార్గదర్శకాలు రూపొందించింది. ఇందుకు అవసరమైన పుస్తకాలను కళాశాలలకు అందజేసింది. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు 5 నుంచి 10 శాతం మాత్రమే ఇంజినీరింగ్, వైద్య సీట్లు పొందుతున్నారు. ఉన్నత విద్య చదవాలనే పేద విద్యార్థులకు ఉన్నప్పటికీ సరైన శిక్షణ లేకపోవడంతో వెనుకబడిపోతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంపిసి, బైపిసి కోర్సులు ప్రధానంగా సబ్జెక్టుగా బోధిస్తున్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్ శిక్షణ తీసుకోవాలంటే ప్రైవేటుగా లక్షలు ఖర్చు పెట్టాల్సిందే. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో పేద విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గుతుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ పాఠ్యాంశాలతో పాటు ఇపిసెట్, నీట్ తదితర పోటీ పరీక్షలు రాసేందుకు శిక్షణ ఇవ్వాలని ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిందని అధికార వర్గాలు తెలిపాయి.

## మహిళా సర్పంచ్ అదృశ్యంపై ఫిర్యాదు

కోట, జూన్ 6 ప్రభాతవార్త: మండలం గూడలి గ్రామ పంచాయతీకి చెందిన మహిళా సర్పంచ్ అదృశ్యమైనట్లు కోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు అందింది. అయితే ఆమె బంధువుల ఇంటికి, స్నేహితుల ఇంటికి వెళ్లిందా అనే కోణంలో కూడా పోలీసులు విచారిస్తున్నారు. మహిళా సర్పంచ్ అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందిందని ఎస్ఐ పవన్‌కుమార్ చెప్పారు. విచారిస్తున్నట్లు తెలిపారు.

## పలు దొంగతనం కేసుల ముద్దాయిలు అరెస్ట్

**-24 గ్రాముల బంగారం, మూడు వేల నగదును రికవరి**

దొరవారి సత్రం,జూన్ 6ప్రభాతవార్త: దొరవారిసత్రం మండల పరిధిలోని నెలబల్లి, ఎన్అగ్రహారం, తల్లంపాడు తదితర గ్రామాలోని దేవాలయాలలో దొంగతనాలకు పాల్పడిన వారిని జిల్లా ఎస్పీ ఆదేశాలు మెరకు నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు నాయుడుపేట రూరల్ సిఐ సంగమేశ్వరావు అధ్వీరంలో ఎస్ఐ అజయకుమార్ వారి సిబ్బంది పట్టుకున్నారు. పోలీసులు వివరాలు మెరకు సూళ్లురుపేట మండలం సూళ్లరుకు చెందిన దార ప్రసన్న కుమార్, కాధరి కిశోర్, దొరవారిసత్రం మండలం శ్రీధనమల్లి గ్రామానికి చెందిన దమ్మాయి ప్రశాంత్లు కలిసి వివిధ దేవాలయాలలో చోరిలకు పాల్పడారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు తల్లంపారు. టోల్ ప్లాజా వద్ద ప్రసన్న కుమార్, ప్రశాంత్లను ఎస్ఐ అజయ్‌కుమార్ అరెస్ట్ చేశారు. అనంతరం వీరి వద్ద ఉన్న 24 గ్రాములు బంగారం, మూడు వేల రూపాయిల నగదును సీజ్ చేశారు. అనంతరం వీరిని సూళ్లరుపేట కోర్టులో హాజరు పరిచిన్నట్లు సిఐ సంగమేశ్వరావు తెలిపారు.




## ప్రతిష్టాత్మకంగా వేమాలమ్మ విగ్రహ ప్రతిష్ట



దొరవారి సత్రం,జూన్ 6 ప్రభాతవార్త: మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా ఏర్పాటు చేసిన శ్రీ మొలక వేమాలమ్మ విగ్రహ ప్రతిష్ట శుక్రవారం ఏర్పాటు చేశారు. దొరవారి సత్రం మండల పరిదిలోని అక్కరపాక గ్రామంలో వెలసిన శ్రీ మొలక వేమాలమ్మ దేవస్థానం వద్ద వేలాది మంది భక్తులు కిటకిటలాడారు. ఈ విగ్రహ ప్రతిష్టకు మాజి ఎంపి సూళ్లురుపేట తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం నాయుడుపేట రూరల్ సిఐ జి.సంగమేశ్వర్ రావు, దివి సత్రం ఎస్సై జి.అజిత్ కుమార్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కరపాక గ్రామస్తులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## రూ.500కోట్లతో
## తిరుపతిలో అద్భుతంగా ఇంటిగ్రేటెడ్ బస్ భవనం

తిరుపతి(రవాణ),జూన్ 6ప్రభాతవార్త: కొన్ని దశాబ్దాల క్రిందట అప్పటి తిరుమల,తిరుపతి ప్రజల అవసరాలకు తగ్గట్లు తిరుపతిలో నిర్మితమైన సెంట్రల్ ఆర్టీసి బస్టాండు ఇప్పటి భక్తుల రద్దీకి ,విపరీతంగా పెరిగిన ప్రయాణీల సేవలకు తగ్గట్లు లేకపోవడంతో అధునాతన నూతన ఇంటిగ్రేటెడ్ బస్టాండు టర్మినల్ నిర్మాణం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పదిసంవత్సరాల క్రిందట ప్రతిపాదనలు ఇప్పుడు అమలులోకి వస్తుండటంతో సుమారు 500 కోట్ల రూపాయలు వ్యయంతో గ్రౌండ్‌ఫ్లోర్‌తో బాటు 10 అంతస్థులతో తిరుమల ఆలయ నమూనా తరహాలో ఈ ఆర్టీసి బస్టాండు ఇంటిగ్రేటెడ్ టర్మినల్ నిర్మాణం చేయాలని ఆమోదించారు. ప్రస్తుతం 60వేలమంది ప్రయాణీకులతో, 50వేల మంది వరకు యాత్రికులతో నిత్యం రద్దీగా ఉండే తిరుపతి సెంట్రల్ బస్టాండు (ఏడుకొండలు బస్టాండ్, శ్రీహరిబస్టాండు, శ్రీనివాసాబస్టాండ్) నుండి తెలంగాణా, తమిళనాడు, కర్నాటక,పాండిచ్చేరి రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఆర్టీసిబస్సులతోబాటు తమిళనాడు, కర్నాటక,పాండిచ్చేరి రాష్ట్రాల ఆర్టీసి బస్సులు తిరుపతికి వస్తున్నాయి. ఇక్కడకు వస్తున్న ప్రయాణీకుల సౌకర్యంతోబాటు



అన్ని రకాల వాణిజ్య సముదాయాలకు నిలయంగా ఇంటిగ్రేటెడ్ బస్టేషన్ అభివృద్ధి చేసేందుకు డిపిఆర్ సిద్దమైంది. బస్‌టర్మినల్ నుండి కూతవేటు దూరంలో ఉన్న రైల్వే స్టేషన్‌కు స్కైవే ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు కానుంది. 13ఎకరాల్లో ఉన్న తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రస్తుతం 70వరకు ప్లాట్‌ఫామ్‌లతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సు సర్వీసులతో నిండిపో తోంది. ఈ బస్‌స్టేషన్ నుండి తిరుమలకు నేరుగా రోడ్డుసౌకర్యం ఉంది. ఈ నిర్మాణ పనులను నేషనల్ హైవేస్ ఆథారిటీ ఆఫ్ ఇండియా చేపట్టనుంది. నూతన టర్మినల్‌లో గ్రౌండ్‌ఫ్లోర్‌లో అన్ని ప్రాంతాలకు వెళ్ళే బస్సు ప్లాట్ ఫామ్‌లు, మొదటి అంతస్థుల నుండి ప్రయాణీకులకు సదుపాయాలు, వాణిజ్యసముదాయాలు, హోటళ్ళు, ఆర్టీసి కార్యాలయాలు, డార్మిటరీలు, డ్రైవర్ల విశ్రాంతి గదులు, ప్రవేశ,నిష్క్రమణ ద్వారాలు ఉంటాయి. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని 3లక్షల మంది వరకు ప్రయాణీలకు సరిపోయేలా,మరో నాలుగు దశాబ్ధాల వరకు ఇబ్బంది లేకుండా ఈ అధునాతన ఇంటిగ్రేటెడ్ బస్టాండు నిర్మాణం జరగనుంది.

## కన్నుల పండువగా అర్జున తపస్సు

**-కదలి వచ్చిన చుట్టు పక్కల గ్రామాల ప్రజలు**



శ్రీకాళహస్తిరూరల్,జూన్ 6 ప్రభాతవార్త : ఏర్పేడు మండలం పాత వీరాపురం గ్రామంలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న 51వ వార్షికోత్సవం సందర్బంగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు కార్యక్రమాలు కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు,భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు. గ్రామాల్లో ఉత్సవాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని పలు చోట్ల ధర్మరాజుల ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించం ఆనవాయితి. ఈ నేపధ్యంల పాతవీరా పురంలో వన్నెకుల క్షత్రియులు అధిక సంఖ్యలో ఉన్నారు.ఈ నేపధ్యంలో ఇక్కడ ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు.ఈ నేపధ్యంలో శుక్రవారం అర్జున తపస్సు కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. రంగస్థల నటులను ఆహ్వానించి భారత పఠనం నిర్వహిస్తున్నారు. శుక్రవారం అర్జున తపస్సు ఘట్టం రాగా నిర్వహించారు.అర్జున వేష ధారి నిమ్మకాయలు విభూది కలిసిన సంచితో తాటిమానుమీద ఎక్కి తపస్సు జరిపినట్లు అక్కడ నుంచి నిమ్మకాయలను చల్లటం జరిగింది. తరువాత అమ్మవారు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను సర్పంచ్ మంజుల హాజరు కాగా మాజీ జడ్‌పిటిసి మునిరంగారెడ్డి మాజీ ఎంపిటిసి మునిరత్నం రెడ్డి, ఆలయ చైర్మెన్ కొంగర కృష్ణారెడ్డి, ఆలయ పూజారి రవి,కాయం దొరస్వామి,కావలి బాలాజి, మనోహర్ పాతగుంట మాధవరెడ్డి తదితరుల సారధ్యంలో ఉత్సవాలు నిర్వహించారు.

## పుస్తక పఠనం అలవర్చుకోవాలి



తిరుపతి విద్య, జూన్ 6 ప్రభాతవార్త : స్థానిక అన్నమయ్య సర్కిల్లోని గ్రేడ్ 1 ప్రభుత్వ గ్రంధాలయం తిరుపతి నందు గ్రంధాలయాధికారి జె.శివ ప్రసాద్ అధ్యక్షతన వేసవి విజ్ఞాన తరగతుల ముగింపు వేడుకలు గురువారం నిర్వహించ దమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కె. శంకర య్య, మండల విద్యాధికారి, తిరుపతి( గ్రామీణ మండలం) యస్.హరి ప్రసాద్,డిప్యూటీ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్, తిరుపతి డాక్టర్ కె.కిశోర్ కుమార్, ప్రముఖ మానసిక వైద్యులు, ఇందిరా హాస్పిటల్,తిరుపతి వారు హాజరు అయ్యారు. నడ్డి నారాయణ, ఇంపాక్ట్ ట్రైనర్ సభాధ్యక్షత వహించారు.శంకరయ్య, మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారానే తాను ఈ స్థాయికి చేరానాని, కావున పిల్లలు చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవాలని, పుస్తక పఠనం వల్లనే విజ్ఞానాన్ని పెంపొందించు కోవచ్చని, గ్రంధాలయంలో జరిగే ఈ ఉచిత వేసవి విజ్ఞాన తరగతులకు పిల్లల హాజరు అవడం వలన వారిలో సృజనాత్మకతను పెంపొందించుకునేందుకు దోహదపడతాయని తెలిపారు.హరి ప్రసాద్, డిప్యూటీ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గ్రంధాలయ శాఖావారు ఉచితముగా నిర్వహించే ఈ వేసవి విజ్ఞాన తరగతులను వీలైనంత ఎక్కువ మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొని సద్వినియోగించు కోవాలన్నారు. నడ్డి నారాయణ, ఇంపాక్ట్ ట్రైనర్,తహసున్నిస బేగం,ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, డాక్టర్ పి.గోపాల్,ఇంగ్లీషు ట్రైనర్,గాయత్రి దేవి, అర్చన, డాక్టర్ సోము ఉమాపతి, గ్రంధాలయ సిబ్బంది గోవిందు, రమణమ్మ, విద్యార్థులు తల్లిదండ్రులు, పాఠకులు పాల్గొన్నారు.

## శ్రీవారి సూవలో కంచిమఠం పీఠాధిపతులు



తిరుమల,జూన్ 6ప్రభాతవార్తప్రతినిధి: కంచి కామకోటిమఠం పీఠాధిపతులు విజయేంద్రసరస్వతి, సత్యచంద్రశేఖర సరస్వతి స్వామి శుక్రవారం వేకువ జామున శ్రీవారి సుప్రభాతసేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి దర్శనం చేయించి వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి సేవలో మాజీసిఎం నల్లారి

తిరుమల,జూన్ 6ప్రభాతవార్తప్రతినిధి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సిఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్‌లో అనుచరులతో కలసి వచ్చిన శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు.



## ఈ నెల 13నశ్రీకాళహస్తికి షర్మిల రాక

శ్రీకాళహస్తి,జూన్ 6 ప్రభాతవార్త : రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల ఈ నెల 13న శ్రీకాళహస్తికి రానున్నట్లు శ్రీకాళహస్తి నియోజకరవర్గ ఇన్‌చార్జి తలపా దామోదర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ మేరకు షర్మిల రాక సభను జయప్రదం చేయటానికి శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసారు. తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా ఆమె శ్రీకాళహస్తికి వస్తున్నట్లు కార్యకర్తల సమావేశంలో ప్రకటించారు. ఆమె సమావేశాన్ని పట్టణ పొలిమేరల్లోని ఆర్‌జి ఆర్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఆచరించాల్సిన ప్రణాళికలను ఆమె వివరిస్తారని తెలిపారు.శుక్రవారం జరిగిన సమావేశంలో సమావేశానికి జిల్లా అధ్యక్షులు బాలగురవం బాబు, సూళూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త వెకంటాచలపతి, జిల్లా ఉపాధ్యక్షులు శబరి రాజన్, ఎంకే మణి, మైనారిటి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కరిముల్లా, రేణిగుంట మండల అధ్యక్షులు తోటకూర రాహుల్‌రాయల్, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్రరెడ్డి, ఆంటోని, శ్రీకాళహస్తి మండల యువజన అధ్యక్షులు నవీన్, తొట్టంబేడు మండల ఉపాధ్యక్షులు తిరుమల, నాగలాపురం యువజన అధ్యక్షులు షణ్ముగం, జానకిరామయ్య, చందు,బద్రి తదితరులు సమావేశం విజయవంతానికి జనసమీకరణకు సంబంధించి మాట్లాడారు.



## తుడా నిధులతో శ్రీకాళహస్తి అభివృద్ధికి ప్రణాళికలు

**- రూ.23కోట్లు కేంద్ర నిధుల కోసం ప్రయత్నం : బొజ్జల**




శ్రీకాళహస్తి,జూన్ 6 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి తుడా పరిధిలో ఉంది కాబట్టి ఇక్కడ తుడా నిధులతో ఏఏ పనులుచేయవచ్చునో పరిశీలించి, తుడా చైర్మెన్‌తో కలసి నిధులు సాధనకు కృషి జరుగుతుందని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన శ్రీకాళహస్తి అభివృద్ధికి సంబంధించి వివరించారు. ముఖ్యంగా తుడా నిధుల సాధనకు కృషి చేస్తున్నామన్నారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటి అభివృద్ధికి సంబంధించి చక్కటి ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో పన్నుల విధానం అస్తవ్యస్తంగా ఉందన్నారు. శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రిని తుడా నిధులతో అభివృద్ధి చేయుటకు పరిశీలిస్తున్నట్లు వివరించారు. ప్రాధమిక అంచనాల మేరకు రూ.15కోట్లతో ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఇక గత ప్రభుత్వం శివం టు శివం రోడ్డు నిర్మాణానికి రూ.44కోట్లుతో సొమ్ములు స్వాహా చేయటానికి సిద్ధం చేసారని అయితే కానీ తాము అధికారంలోకి వచ్చిన తరువాత దానిని రూ.29కోట్లకు టెండర్లు పిలిచామన్నారు. అయితే పట్టణంలోని మురుగునీరు తరలించుటకు మరో రెండు మూడు కోట్లతో కొత్తగాడ్రైనేజ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయని ఆదేశించినట్లు సుధీర్‌రెడ్డి వివరించారు.

**కొండమిట్ట ఎన్‌టిఆర్ నగర్ సమస్యలపై దృష్టి:**

తాను ఎన్నికల ప్రచారానికి వెళ్ళి నపుడు 4,6,7 వార్డుల్లో మంచినీటి సమస్యను వివరించారన్నారు. అయితే కొండమిట్ట ఎన్‌టి ఆర్ నగర్ ప్రాంతాల్లో మంచినీటి సరఫరా పైప్‌లైన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని నడిరోడ్డులో విద్యుత్ స్థంభాలు న్నాయని వాటిని సరిదిద్దుటకు మున్సిపల్ అధికారులకు ఆదేశించామన్నారు. ముఖ్యంగా కొండమిట్ట ప్రాంతంలో మంచినీటి సరపరాకు ఒకే పైప్ లైన్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.పాత మంచినీటిసరఫరా లైన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని వాటిని తొలగించనున్నట్లు వివరించారు. కొండమిట్టలో ప్రతి ఇంటికి మంచినీటి కొళాయలను అందిస్తామని సుధీర్‌రెడ్డి వివరించారు. ఇక్కడ నడిరోడ్డులో విద్యుత్ స్థంభాలు ఇబ్బందిగామారిందన్నారు. వాటిని తొలగింపుకు ఆదేశించామని అయితే నిధుల కొరత ఉందన్నారు.విద్యుత్ సమస్యను పరిశీలిస్తే తొట్టంబేడు గ్రామంలో మధ్యలో 11 కెవి లైన్ పోతుందని గతంలో ఇక్కడ ఓ మహిళ మృతి చెందిందన్నారు.

**మున్సిపాలిటిలో సోలార్ వినియోగం:**

శ్రీకాళహస్తి మున్సిపాలిటి లో నెలకు కరెంటు బిల్లులు సుమారు రూ.20లక్షలు వస్తుందని దానిని నివారించుటకు సోలార్ సిస్టంను అమలుకు ఆదేశించా మన్నారు. మున్సిపాలిటి పరిధిలో వాహనాలు వృధాగా పడి ఉన్నాయని వాటిని పరిశీలించి వేలం వేయటానికి ఆర్‌టిఓ వస్తున్నారని వివరించారు. వాటిని వేలం వేసి వచ్చిన సొమ్ములతో కొత్త వాహనాలు కొనుగోలు చేసి పారిశుద్ధ్యం సమర్థవంతంగా నిర్వహించుటకు చర్యలు తీసుకుంటామని సుధీర్‌రెడ్డి వివరించారు.

# గూడూరు డివిజన్

## రైతులకు విరివిగా సేవలు అందిస్తారు



వెంకటగిరి, జూన్ 6 ప్రభాతవార్త: రైతులకు విరివిగా సేవలందిస్తానని డిసిఎంఎస్ చైర్మన్ దొంగోడు నాగేశ్వరరావు తెలిపారు. డిసిఎంఎస్ కార్యాలయంలో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. డిసిఎం ఎస్ అందరికీ సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ముఖ్యంగా రైతులకు విరివిగా సేవ చేస్తానని చెప్పారు. జిల్లా కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్‌గా మెట్టుకూరు ధనంజయ రెడ్డి కూడా బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీరికి మండల పార్టీ అధ్యక్షులు చంద్రమోళి రెడ్డి, మధు నాయుడు తదితరులు అభినందనలు తెలిపారు.

## ఆరోగ్యం కోసం యోగా చేయాలి : సిఐ



వెంకటగిరి, జూన్ 6 ప్రభాతవార్త : ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగ చేయాలని వెంకటగిరి సీఐ ఏవి రమణ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని నగరవనంలో సర్కిల్ కార్యాలయం పోలీస్ సిబ్బందికి సిఐ యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా చేయడం వల్ల అందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. మానసిక ఒత్తిడిని యోగ పూర్తిగా నివారిస్తుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యోగపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యోగా చప్పట్లు శీర్షాసనాల కూడా వేయాలని సూచించారు. బాలాయపల్లి ఎస్సై కామినేని గోపి సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరాలు

వెంకటగిరి, జూన్ 6 ప్రభాతవార్త : పట్టణంలోని తూర్పు వీధిలో వలన గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాలు ముగిశాయి. విద్యార్థులకు ఎంఈఓ బాబయ్య చివరి రోజు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అల్లిశెట్టి అంజయ్య, సహాయకు రాలు, తాటిశెట్టి లీలావతి తదితరులు పాల్గొన్నారు.



## రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేసుకోవాలి




బాలాయపల్లి, జూన్ 6 ప్రభాతవార్త : రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేసుకోవాలని కెవికె శాస్త్రవేత్త రాజీవ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం, పెరియవరం, వెంకటగిరి శాస్త్రవేత్త రాజీవన, బాలయపల్లి మండలంలోని కాలగంధ, నిడిగళ్ళు గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ నిర్వహించడం జరిగింది. భూసారాన్ని బట్టి మందులు ఎరువులు రైతులు వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులతో పరస్పర ముఖాముఖి ప్రత్యక్ష పరస్పర చేర్చా కార్యక్రమాలను, సదస్సులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెండ సమగ్ర యాజమాన్యం, వరిలో రకాలు, ఎరువుల యాజమాన్యం, పురుగుల యాజమాన్యం, భూసారా పరీక్ష ఆదరితా పోషక యాజమాన్యం వంటి అంశాలను వివరించి కరపత్రాలను రైతులకు అందించడం జరిగింది. పంట భీమా యోజన పట్ల అవగాహనా కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మరియు ఉద్యాన అధికారులు రైతులు పాల్గొన్నారు.

## ముగిసిన కిషోర్ వికాసం కార్యక్రమం

వెంకటగిరి, జూన్ 6 ప్రభాతవార్త: కిశోరి వికాసం వేసవి ప్రత్యేక కార్యక్రమాల ముగింపు సందర్భంగా ఈ నెల 10న తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తహసీల్దార్ రాంబాబు తెలిపారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కౌమార బాలికలను రక్షించడానికి, సాధికారపరచడానికి, విద్యావంతులను చేయడానికి, అలాగే బాల్య వివాహాలను నిర్మూలించడానికి సమాజంలో చైతన్యం పెంపొంది ంచడంపై కలెక్టర్ ప్రసంగిస్తారని వివరించారు. మహిళా సంరక్షణ కార్యదర్శిని, అంగన్ వాడీ కార్యకర్తలు, గ్రామ సంఘం సహాయకులు ఆశా ఏఎస్ఎం, పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

## ఆర్ఎంపిల వైద్యంతో రోగాల భారీన పడుతున్న ప్రజలు

నాయుడుపేట జూన్ 6 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణం, గ్రామాలోని మేనకూరు, అన్నమేడు, పండ్లూరు తదితర గ్రామాల్లో ఆర్ఎంపిలు వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నాయుడుపేట పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో కొంమంది ఆర్ఎంపిలు అద్దెభవనాలను తీసుకొని తెలిసితెలియని అరకొర వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఈవిషయమై ప్రభాతవార్త డ్రగ్ ఇన్స్‌పెక్టర్ ప్రశాంతిని వివరణ కోరగా ఆమె మాట్లడుతూ నాయుడుపేటలో ఎవరైన మత్తుకు సంబందించిన టాబ్లేట్స్,ఇంజక్షన్‌లు విక్రయిస్తుంటే అటువంటి మెడికల్ షాపులపై తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



## బక్రీద్ ప్రార్థనలకు ముస్తాబౌతున్న ఈద్‌గాహ్‌లు

శ్రీకాళహస్తి,జూన్ 6 ప్రభాతవార్త : నేడు బక్రీద్, ముస్లింలు ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే రెండు పండగల్లో రెండవది బక్రీద్. మక్కాలో శుక్రవారం బక్రీద్ పండగ సందర్భంగా ఈదుల్ అజ్‌హా ప్రార్థనల్ని కోట్లాది మంది భక్తులు ఆచరించనున్నారు. భారత దేశంలో నేడు (శనివారం) జరుపుకోనున్నారు. ప్రపంచం లోని ముస్లింలు నమాజు ఆచరించి వెళ్ళి ఖుర్బానీ ఇవ్వాల్సి ఉంటుంది కాబట్టి ఉదయం 9గంటల లోపల అన్ని ఈద్‌గాహ్‌లలో నమాజులు పూర్తి చేయుటకు సన్నాహాలు జరుగుతున్నాయి. శ్రీకాళహస్తిలో నమాజులు ఆచరించే వేళలను ముఫ్తి నయిం సాహెబ్ ఖరారు చేసారు. రాజీవ్‌నగర్‌లోని ఈద్‌గాహ్‌లో ఉదయం 6.30గంటలకు ఉపన్యాసం ప్రారంభం అవుతుందని ఉదయం 7గంటలకు నమాజు ఆచరిస్తారని తెలిపారు. కాగా ఈదుల గుంట (జామియా మస్జిద్ ఈద్‌గాహ్)లో ఉదయం 7.30గంటలకు ప్రసంగం 8గంటలకు నమాజు ఆచరిస్తారని అయ్యలనాడుచెరువు ఈద్‌గాహ్‌లో ఉదయం 8గంటలకు ప్రసంగం 8.30గంటలకు నమాజు ప్రారంభం అవుతుందని నయిం సాహెబ్ వివరించారు.ఈ మేరకు ముస్లిం సోదరులు నమాజులకు సమయపాలనను ఆచరిస్తూ హాజరు కావాలని పిలుపు నిచ్చారు.

ఖుర్బానీ ప్రాధాన్యత:

ముస్లిం సోదరులు ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే పండగల్లో రెండు ప్రధానమైనవి. ఇందులో 30 రోజుల పాటు ఉపవాస దీక్షలు ఆచరించి జరుపుకు పండగను రంజాన్ అంటారు. ఇస్లాం మత వ్యాప్తి కోసం దేవుని ఆజ్ఞ కోసం తన కన్నబిడ్డను సైతం తన చేతులతో బలి (ఖుర్బానీ) ఇచ్చిన రోజూ బక్రీద్ అంటారు. మానవుడు ఆచరించాల్సిన నాలుగు ధర్మాలను పవిత్ర రంజాన్ మాసంలో ఆచరించగా ఐదవది అయిన హజ్ సందర్శనం బక్రీద్‌లో ఆచరిస్తారు

## అల్లుడు చేతిలో తీవ్రంగా గాయపడి... మృతి చెందిన వృద్ధురాలు



పుత్తూరు రూరల్, జూన్ 6 ప్రభాతవార్త: అల్లుడు చేతిలో తీవ్రంగా గాయపడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన పుత్తూరు పట్టణంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ ఓబయ్య కథనం మేరకు... పుత్తూరు మున్సిపాలిటీ కల్యాణపురం ఎస్సీ కాలనీకి చెందిన చెంచయ్య, నరసమ్మ భార్య భర్తలు. వీరికి కుమారుడు వెంకటేష్, కుమార్తెలు కల్యాణి, కావేరి ఉన్నారు. వీరందరికి వివాహాలు అయ్యాయి. కుమారుడు వెంకటేష్ పెయింటర్‌గా పని చేస్తూ వేరు కాపురం ఉంటున్నారు. ప్రస్తుతం భార్యభర్తలు జగనన్న కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో చంద్రగిరిమండలం చందమామవారిపల్లె ఎస్టీ కాలనీకి చెందిన మోహన్‌కి ఇచ్చి కల్యాణిని 2016లో వివాహం జరిపించారు. వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండు నెలల క్రితం కల్యాణి పుట్టింటికి చేరింది. బుధవారం రాత్రి అల్లుడు మోహన్ భార్యని తీసుకొచ్చేందుకు ఇంటికి వచ్చాడు. ఈ సమయంలో భార్యభర్త మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణ జరిగే సమయంలో నరసమ్మ వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేసింది. ఈ సమయంలో అల్లుడు త్తపై కర్రతో దాడి చేశాడు. ఆమె తీవ్రంగా గాయపడింది. పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి తిరుపతి రుయాకు తరలించారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



## శ్రీకాళహస్తి విద్యార్థిని అభినందించిన సిఎం

శ్రీకాళహస్తి,జూన్ 6 ప్రభాతవార్త :ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాలలో శ్రీకాళహస్తి మండలం గుంటకిందపల్లి గ్రామానికి చెందిన మాండవ్యపురం జైభారత్‌రెడ్డి, సురేఖ దంపతుల రెండవ కుమారుడు మాండవ్యపురం భానుచరణ్‌రెడ్డికి ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు 51 సాధించినందుకు విజయవాడలో సిఎం నివాసము నందు భానుచరణ్‌రెడ్డి చంద్రబాబు నాయుడు అభినందించారు. రాబోయే పది సంవత్సరాలల్లో క్యాంటం కంప్యూటర్స్ డెవలప్ చేయమని తెలిపారు.